

పొంతలు

శ్రీమతి K. గంగాధరభట్ల

అది వెన్నెలరాత్రి. చంద్రుడు తన కిరణాలను నాల్గువైపులా ప్రసరిస్తున్నాడు. చంద్ర కిరణాలు చూచి భూమి నవ్వుతుందేమోననిపిస్తూంది. సుశీల చంద్రకాంతిని చూచి ముకిసిపోయింది కాని ఆమె ప్రాణపతి అక్కడే లేనందున ఆమె ముఖం ముడిచికొంది. ఒక్క క్షణంలో ఆమె సంతోషం మటుమాయమైంది. మనసున స్మృతిపథానికి కవి "ఉమర్ ఖయ్యాం" వ్రాసిన "మధుకలశం" తోచింది. "నవప్రియ నిన్నటికోసం పుట్టబోయే రేపటికోసం ప్రాకులాడ "వద్దం"టాడు మహానుభావుడు. యిప్పటివల కావ్యాలం కాదు. అది మరణించేలోగా జీవితంలోని ప్రతిదాని మాధుర్యాలని, ప్రియురాలి చేతిమీదుగా తనివితీరా తాగమంటాడు." ఎంతచక్కగా చెప్పాడు మహానుభావుడని అనుకొంటూంది. సుశీల తన చూపుల్ని మబ్బుకమ్మిన ఆకాశంవేపు చూచేలాగ ఆమె తన భర్త రాకను ఎదురు చూస్తూంది. తన భర్త ప్రియవదనం ఎప్పుడూ ఎదురుగా నుండాలని, ప్రియవచనాలు వినటాన్ని ఎప్పుడూ కోరేది.

నదులువచ్చి సముద్రంలో కలియటం, వికసించిన పుష్పాలమీద తుమ్మెదలు వ్రాలటం యిలాంటి దృశ్యాలు ఆమెకు చాల సరదా.

పూర్ణచంద్రుడు ప్రత్యక్షమయి రెండు గంటలు యింది. సుశీల తన భర్తను ఆ రోజు వేగిరం రమ్మన్నది. ఆమెకు వెన్నెల భోజనం అంటే సరదా. ఏడో గంటకల్లా వంటలు, పరమాన్నం, ఫలహారాలు తయారయాయి. ప్రతిదినం వేళకువచ్చేవాడు ఆ దినం యింకా రాలేదు. తను సంతోషంగా చేసిన ఏర్పాట్లకు ఏమిఅడ్డు తగుల్తోందని దిగులుపడుతోంది

సుశీల. యిరుగుపొరుగువారు ఒకరి తర్వాత ఒకరుగా యిళ్ళకుచేరుకొంటున్నారు. ఎనిమిది గంటలు కొట్టేరుకాని రావు యింకా రాలేదు.

నేను వెన్నెల భోజనం వండిన్నాడే వీరు ఆలస్యంగా వస్తారు. అన్నీ చల్లారిపోతున్నయి. నిద్ర కూడా వస్తూంది. పదిగంటలకు భోజనానిక్కూర్చొని "ఛా! ఏమిటివి? అప్పడాలు వేయించటానిక్కి బదులు వేడినీళ్ళలో నానవేశావా?" అని లోటుపాట్లు ఎంచుతూ కూర్చుంటారు. ఈయనగారి సంగతి తెలిసిందేగా? అని చికాకుగా తనలో సణుగుకొంటూ పడకగదిలోకి తిరిగివెళ్ళి పక్కలుసర్ది నాల్గు సాంబ్రాణివత్తులు వెలిగించి నిలువుటద్దంలో తన అందాన్ని సర్దుకొని, వాకిట్లో యీజీ ఛైరులో కూర్చొని చంద్రభగవానుని శీతల కిరణాలక్రింద హాయిననుభవిస్తూంది. యింతలో తలుపుతట్టిన శబ్దం విని తలుపుతీసింది. రావుని చూడగానే చరచరామని వంటింట్లోకిపోయి కుంపటిమీదనున్న వంటకాలు వాకిట్లో తెచ్చిపెట్టి వెండికంచంలో వడ్డనచేసింది. సంతోషంగా మాట్లాడుకొంటూ భోజనం చేద్దామనుకొన్న సుశీల ఆశ నెరవేరలేదు. భోజనాలు మౌనంగా పూర్తయినాయి. సుశీల ముఖంలో వెలిగే కోపజ్వాలల్ని చూచాడు "రావు". అంచేత అతనూ మౌనంగా ఉన్నాడు. భోజనమయ్యాక రావు యీజీఛైరులో కూలబడ్డాడు. పళ్ళెంతో తాంబూలంతెచ్చి ముందరపెట్టి నిల్చుంది సుశీల. అప్పుడుకూడా రావు నోరు తెరవలేదు. సుశీల మౌనంగా మరి ఉండలేకపోయింది.

"ఇటువంటిరోజుల్లో మీరు ఆలస్యంగా రావటానిక్కే నిశ్చయించారా?" అన్నది సుశీల.

"అవును" అన్నట్టుగా తలూపాడు రావు.

"ఏమిటి అవునా?" అంది సుశీ.

"ఏమిటి అవును అంటే నాకర్థంకాలే"దన్నాడు రావు.

"యింతసేపటిదాకా ఆఫీసులోనే ఉన్నారా?"

"లేదు" అన్నాడురావు అర్ధనిమీలిత నేత్రాలతో.

"మరి?" అంది సుశీల.

"మరి అంటే ఏమీలే"దన్నాడు చిలిపిగా.

సుశీల మాట్లాడలేకపోయింది. కోపం మాత్రం యినుమడించటంవలన చరచరా వంటింట్లోకిపోయి గ్లాసుడుపాలు తెచ్చి అతని ముందుపెట్టి పడకగదిలోకి పోయి పడుంది. రావు ఆ గ్లాసు పాలతో ఆమెను అనుసరించాడు. మేజాబల్లకు ఎదురుగానున్న కుర్చీలో కూర్చొని ఆమెవేపు తన దృష్టిని పోనిచ్చాడు.

"మీ ప్రవర్తన నాకనుమానంగాఉంది" అంటూ లేచి కూర్చుంది సుశీ.

"ఏమి" అన్నాడు రావు ?

"ఆఫీసు 5 గంటలకు అయిపోతే రాత్రి పది గంటలవరకూ ఏంచేస్తున్నారు ? ఎక్కడ తిరుగుతున్నారు ? ఎవరితో పొద్దుగడుపుతున్నారను కోనేది ?"

"ఎవరితో ఎక్కడ తిరుగుతున్నానని నీ సందేహం ?"

"అదే నేను అడుగుతూంట"

"నన్ను చూస్తే సందేహించాల్సిగానేఉందా ?"

"అది సరేకాని, మీరు చదువుకొంటున్నప్పుడు ఏ యువతైనా మిమ్మల్నిచూసి ఆశపడిందా ?" అంది సుశీ.

యీ ప్రశ్న సుశీ నోటంట వినగానే తనలో నవ్వుకొని "అబద్ధం ఎందుకు చెప్పాలి, నిజమైన సంగతి చెప్తావిను. ... ... మీనాక్షి అనే అమ్మాయికి ఆశ కలిగినమాట నిజమే ! కాని ఆ ఆశ నిరాశ అయింది" అన్నాడు రావు.

ఆమాట వినగానే సుశీకి తేలు కుట్టినట్టయింది.

"నా సందేహం నిజమే నన్నమాట ? ఇప్పుడిప్పుడే మీ బండారాలు బైటపడుతున్నాయి. ఆమె ఎవరు ! ఆమె కథ చెప్పమ"ని హెచ్చరించింది రావుని.

"చెప్పబోతే కథలాగనే ఉంటుందికాని అది గావు కనుక చెప్తావిను" అని ప్రారంభించాడు రావు.

నేను కాలేజీలో చదివే రోజుల్లో జరిగిన సంఘటన. ప్రతిదినం ట్రాములో కాలేజీకి పోతూండేవాడిని. ప్రతిరోజూ మీనాక్షికూడా ఆ ట్రాములోనే వచ్చేది. ఆమె చేతులోని పుస్తకాలుబట్టి "లా" చదువుతూందని తెల్సుకొన్నాను. ప్రతిదినం ఒకే ట్రాములో కలుసుకొని వెళ్తూండడంచేత మాకు ఒక విధమైన పరిచయం కలిగింది. ఎప్పుడైనా ఆ ట్రాములో ఆమె రాకపోతే దాన్ని తప్పి రెండో ట్రాం కోసం కాచేవాడిని. ఒకనాడు "Wedding" కార్డులు ఆమె చేతిలో చూచాను. వాటిని చూడగానే నా మనసులో ఎందుకో బాధ కలిగింది. నేను వాటిపైపే చూస్తూండటం తెలుసుకొని గారవార్థం ఓ పత్రికతీసి, "మా తమ్మునికి వడుగుచేస్తారు" అంటూ యిచ్చింది. ఆ మాటలు విన్న తర్వాత నా మనసుకు శాంతి కలిగింది.

"అలానా ? మీకే వివాహం జరగబోతోందేమోనని" అనుకొన్నాను. అని నవ్వుతూ ఆ వడుగు పత్రికను అందుకొన్నాను.

"నేను వివాహం చేసుకోను. నా జీవిత లక్ష్యం వేరు. రాబోయే రాజ్యాంగంలోచేరి ప్రజల ప్రతినిధిగా శాసనసభల్లో వారికి సేవచేయదలచాను" అంది మీన.

"నీ కోరిక నెరవేరకూడదు. నీ ఆశ నిరాశ కావాలి. నిన్ను వివాహం చేసుకొని ఈ జీవితాన్ని నడపాలని నా ఆశ" అని నాలో నేను అనుకొన్నాను.

"ఏమన్నారూ ? ... మరోసారి చెప్పండి. అనుకోరామరి ? బాగానే అనుకొంటారు !" అంటూ సుశీల రావుమీద ఒక పిడుగు వదిలింది.

"అలా కంగారుపడతావేం ? యిది మన వివాహానికి పూర్వం జరిగినదన్నమాట మరవకు. ఇప్పుడు ఎవరినైనాచూచి అలా అనుకొంటానా" అని సమాధాన పరచాడు రావు. తిరిగి కథ చెప్పడం ప్రారంభించాడు.

"మా యిద్దరి ఆశలూ నెరవేరలేదు. ఒకనాడు మీనాక్షి మొఖం వాడిఉంది. ఒకవేళ ఒంట్లో బాగు లేదేమో ననుకొంటి. ఈ వేళ అదోలా ఉన్నావేం అనిఅడిగాను మీనాక్షిని. వెంటనే ఆమె కళ్లంట జలజలమంటూ కన్నీరు కార్చింది. ఆమె యిష్టానికి ప్రతికూలంగా మేనమామ కొడుకుతో సంబంధం స్థిరపరిచారట. ఆ మాట వినగానే భరించరాని

మనోవ్యధతో కృంగిపోయాను. నా మనోవాంఛను ఆమెకు తెల్పకుండా ఉండలేకపోయాను. నా హృదయాన్ని విప్పి చెప్పాను.

"మీనా నిజాన్ని దాచడ మెందుకు? నీ పరిచయం నాటినుండి యిన్నాళ్లుగా నాలో ఏ కోర్కె బాధ పెడుతూందీ నీకు తెల్సునా" అని జాలిగా అడిగాను. "తెల్సును, పురుష ప్రాణులు. అందులోనూ మీలాంటి బ్రహ్మచారులు హృదయంలో తహతహ లాడించే కోర్కెలని స్త్రీ హృదయాలు అవలీలగా గ్రహిస్తాయన్న సంగతి మీకు తెలియదూ?" అంది.

ఈ ప్రశ్నవలన ఆమె మనోభావంకూడా నాకు విశదమయింది. నాకు తొట్రుపాటుకూడా అధిక మైంది.

"ఈ వివాహాన్ని ఆపడం నీవలనకాదా?"

"అది కలలోనిమాట. మా తండ్రి చాల పట్టు దల మనిషి" అన్నది.

మీనాక్షి వివాహం అలాగే జరిగి తీరింది. వివాహ మయిన మర్నాడే ఆమె కళాశాలకు వచ్చింది. ఆమెను చూడగల భాగ్యం చిక్కినందుకు నాలో నేను సంతోషించాను. రెండువారాలకుముందు ఆమె ముఖమండలంలో ప్రకాశించినకాంతి మలిన మైంది. దుఃఖరేఖలు వెలుగుతున్నాయి. ఆమె విచార స్వరూపాన్నిచూచి నాలో నేను దుఃఖిం చాను.

ఒకనాడామెను మార్గ మధ్యంలో ట్రాంలోంచి దింపి:—

"అయిష్టమయిన వరుణ్ణి వివాహమాడి జీవిత నావను దుఃఖసాగరంలో నడపటానికి తీర్మానిం చావా మీనా"

"గత్యంతరం? నా తల్లిదాత అలా ఉంది కాబోలు" అంటూ తన విశాల నేత్రాలతో నా వైపు జాలిగా చూచింది.

"... ... ... వాస్తవంగా చెప్తున్నాను. నువ్వు వస్తానంటే చెప్పు. ఈ రోజు రాత్రే యిక్కడనుండి కలకత్తాకుపోయి అక్కడనుండి సింగపూరు ఓడ ఎక్కుదాం" అన్నా ధైర్యంగా.

"సరేనంటూ" తలూపింది మీన.

(రావు అలా చెప్తూంటే సుశీల ఠీవిగా సర్దుకు కూర్చొని) చాల ఆశ్చర్యంగా ఉందే! మీరు చెప్పే కథ నా కథలాగుందే అన్నది ఆశ్చర్యంగా.

"నీ కథా?" అన్నాడు. రావు.

"అవును వినండి" అని చెప్పడాన్కి మొదలు పెట్టింది సుశీల.

"మన వివాహాన్కి పూర్వం, నేనూ ఒకాయనను ప్రేమించాను. నా మాట లక్ష్య పెట్టకుండా మీకిచ్చి వివాహం చేశారు. అప్పటికీ నా స్నేహితుడు నన్ను విడువలేదు. ఒకనాడు ఒంటరిగాకలసి నన్ను ఏమం టావు సుశీలా? నాతో వచ్చేయరాదూ? సింగ పూరుపోయి హాయిగా మన జీవిత రథాన్ని నడు పుదాం అన్నాడు. నేనూ సరే నన్నాను."

"సరేనని ఒప్పుకొన్నావా?" అన్నాడు రావు.

"వివాహమయిన ఒక అమ్మాయిని నాతో లేచి వస్తావా? అని మీరు అడగవచ్చుగాని, నేను సరే నని ఒప్పుకోడం తప్పా?" అని సమాధానం చెప్తూ తన కథ ప్రారంభించింది.

ఆ రోజు రాత్రి కలకత్తాకుపోయే మెయిలువద్దకు నా చిన్న తోలు సూటుకేసుతో చేరాను. అక్కడ నా కన్న ముందువచ్చి ఎదురు చూస్తున్నాడు నా స్నేహితుడు దాసు.

"దాసా?" అన్నాడు రావు ఆశ్చర్యంగా.

"అవును అతనిపేరు దాసు."

నన్ను చూడగానే అతన్కి కల్గిన సంతోషాన్కి

అంతులేదు. "ఎక్కడరాకపోతావోనని సందేహిం చాను" అంటూ అతనిలోని సందేహాన్ని వెలి బుచ్చాడు దాసు.

"రైల్లో ఎక్కి కూర్చున్నాం. రైలు బయలు దేరటాన్కి ఒక గంట టైముంది. అప్పుడు నేను ఆలోచనా రాజ్యంలో పడ్డాను. వివాహమాడిన దాన్ని యిలాంటిపని చేస్తున్నా నేయిది మంచిదేనా?" అని నా అంతరాత్మను ప్రశ్నించాను.

"ఇది తప్పుడు త్రోవ. పెద్దమోసం మహా పాపం ! !" అని నా అంతరాత్మ ఘోష పెట్టింది.

"నా గుండెల్లో దడ పుట్టింది. శరీరం వణక నారం భించింది. నాలో యీ మానసిక మార్పును దాసు గుర్తించాడు."

"నీ వంట్లో బాగులేదా ?" అన్నాడు దాసు.

"ఏమీ లేదు. అలసటగా ఉంది. కాఫీ కావా" లన్నాను.

వెంటనే అతను రైల్లోంచి దిగి పరుగెత్తాడు. అతను నా దృష్టి తప్పాడు. నేనూ రైలుదిగి ఎవరూ చూడకుండా గబగబా స్టేషను ఆవరణదాటి రిక్షాలో యింటికి వచ్చాను. తర్వాత నాల్గురోజులు గడి చాయి. దాసువద్దనుండి జాబువచ్చింది." అన్నది సుశీల.

రావు కొద్దిగా సర్దుకొని "ఏమని వ్రాశాడో నాకు తెలుసు. నే చెప్తా విను."

సుశీలా !

మనం గొప్ప అపచారం చేయదలచాం. భగ వంతుడు తప్పించాడు. అగ్నిసాక్షిగా వివాహ మాడిన నీ భర్తతో గడపడమే ధర్మం. ఇష్టం లేకపోయినా అది నీ విధి. హిందూ స్త్రీకి అదే పెట్టని ఆభరణం అనే ధర్మ సూత్రాన్ని రైల్లో కూర్చున్నాక గుర్తించాను. నన్ను కాఫీకొరకు పంపావు. అప్పుడు తిన్నగా యింటికే వచ్చేశాను. నీవు నాకొరకుచూచి, రైలు కదిలేటైము అయినా నేను రాకపోవటం నా మీద కోపగించి యిల్లు చేరుకొని ఉంటావని యీ జాబు వ్రాస్తున్నాను. నన్ను క్షమించి శాశ్వతంగా నన్ను మరిచిపోయి నీ భారత స్త్రీత్వాన్ని నిలుపుకొంటావని హెచ్చరిస్తున్నాను,

ఇట్లు, దాసు.

అని వ్రాసివుందికదూ ? అన్నాడు రావు.

"ఉండొచ్చు: మీరు ఆరున్నర గంటల ఆట చూచుకొని యీ వేళకు యిల్లు చేరుకొన్నారు కనుక ఒక్కమాటైనా మరచిపోకుండా వప్పచెప్పారు. నేను మేటినీకి వెళ్ళాను. అంచేత నాకు అంతగా జ్ఞాపకం లేదు" అని నవ్వుతూ జవాబిచ్చింది సుశీల.

"నేను సినీమాకువెళ్తే నెలకెన్ని సినీమాలు చూస్తారు ? యిన్నిసార్లువెళ్తే కళ్ళు ఏమవుతాయి ? అని పేచీ పెడతావు. నువ్వు మాత్రం ఏంచేస్తు న్నావు ? ఒక్కదానికైనా తప్పకుండా మేటినీలు చూచి నేను ఆఫీసునుండి వచ్చేసరికి యింట్లో సిద్ధంగా ఉంటున్నావు. ఈ రహస్యం యీ రోజు బైటపడింది" అని నవ్వుతూ రావు అన్నాడు.

"నేను అలా వెళ్ళిచూసి రాకపోతే మీరు చెప్పే కథలన్నీ నిజమనే నమ్మాలి" అంటూ నవ్వుతూ జవాబిచ్చింది సుశీ. ఇద్దరూ నవ్వుకుంటూ వాకిట్లో వెన్నెల్లో కూర్చుని, శీతల చంద్రుని చల్లదనంలో రావు బాహుపంజరంలోకి వ్రాలింది సుశీల.